ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్‌ ఫొటోగ్రఫీ నిరుద్యోగ యువతకు ఉచితంగా ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నారు. ఈ ఆరు నెలల డిప్లొమా కోర్సులో చేరేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ చైర్మన్‌ ఎంసీ శేఖర్‌ తెలిపారు. మార్చి 15వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్‌: 8008021075.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌ డివిజన్‌లోని రంగానగర్‌లో జిప్స్‌ సంస్థ, వైఫోర్‌డీ, జనని ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డివిజన్‌ బీజేపీ మాజీ అధ్యక్షుడు రవికుమార్‌ ముఖ్యఅతిథిగా హాజరైన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనని ఫౌండేషన్‌ అధ్యక్షుడు మల్లేష్‌, నాయకులు వినోద్‌, అరవింద్‌, శ్రీనివాస్‌, నరేష్‌, వెంకటేష్‌, డాక్టర్లు కార్తీక్‌, సురేఖ, కరుణాకర్‌, రాహుల్‌ పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి

చిక్కడపల్లి: అనాథ పిల్లలను ఆదుకుని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్‌ శాఖ ఇన్‌చార్జి జయశ్రీ అన్నారు. శుక్రవారం రామ్‌కోఠిలోని నవజీవన అనాథ ఆశ్రమంలో చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారీస్‌ శాఖకు చెందిన సభ్యులతో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వారికి నోట్‌ పుస్తకాలు, పెన్నులు, తినుబండారాలను అందజేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. ప్రేమికుల రోజు అని యువత సమయాన్ని వృథా చేయకుండా అనాథలు, పేదలకు సాయం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. డబ్బు వృథా ఖర్చు చేయకుండా సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని పాశ్చాత్య సంస్కృతిని వీడనాడలన్నారు.

నిత్య సాహితీ కృషీవలుడు బిక్కి కృష్ణ

ఇన్‌కంట్యాక్స్‌ విశ్రాంత ఉన్నతాధికారి ఎం.నరసంహప్ప

చిక్కడపల్లి: నిత్య సాహితీ కృషీవలుడు బిక్కి కృష్ణ అని ఇన్‌కంట్యాక్స్‌ విశ్రాంత ఉన్నతాధికారి ఎం.నరసంహప్ప కొనియాడారు. విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో కవి, విమర్శకులు బిక్కి కృష్ణ రచించిన వాన వెలిశాక, మార్మిక నది, కాలం నది ఒడ్డున, ప్రకృతి – పర్యావరణం కవితా సంపుటాల ఆవిష్కరణ శుక్రవారం సాయంత్రం సిటీ కల్చరల్‌ వేదికలో జరిగింది. నరసింహప్ప ముఖ్యఅతిథిగా హాజరై సంపుటాలను ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణ ఎంతో మంది కవులను వెలుగులోకి తీసుకొచ్చారని ప్రశంసించారు. తొలుత నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలను చదివారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు నాళేశ్వరం శంకరం, జెల్ది విద్యాధర్‌ రావు, బి.సుందరరావు, కె.కోటేశ్వరరావు, శ్రీనివాస్‌గౌడ్‌, మంజుల సూర్య, రమాదేవి కులకర్ణి, రాధాకుసుమ, రఘు పాల్గొన్నారు.

ప్రేమికుల రోజు.. బంద్‌దైన ఇందిరాపార్కు.!

వీహెచ్‌పీ, బజరంగ్‌ దళ్‌ ఆందోళనల నేపథ్యంలో మూసేసిన పోలీసులు

కవాడిగూడ: నిత్యం ప్రేమికులు, సందర్శకులతో కళకళలాడే నగరంలో ప్రసిద్ధి గాంచిన ఇందిరా పార్కు వాలెంటైన్స్‌ డే (ప్రేమికుల రోజు) సందర్భంగా శుక్రవారం సందర్శకులు లేక బోసిపోయింది. ప్రతి సంవత్సరం లాగానే వాలెంటైన్స్‌ డే సందర్భంగా పార్కులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తుగా దోమలగూడ పోలీసులు జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పార్కును బంద్‌ చేశారు. ఉదయం తెల్లవారుజామున 5గంటల నుంచి ఉదయం 9గంటల వరకు వాకర్స్‌ కోసం పార్కును తెరిచి ఉంచి అనంతరం మూసివేసినట్లు దోమలగూడ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజు 10గంటల తరువాత ఇందిరా పార్కుకు వచ్చే వారికి నిరాశే ఎదురైంది. దోమలగూడ పోలీసులు ఇందిరాపార్కుకు ధర్నా చౌక్‌ వైపు ఉన్న ప్రధాన గేటు, లోయర్‌ ట్యాంక్‌ బండ్‌లోని రామకృష్ణ మఠం ఎదురుగా ఉన్న మరో గేటుకు తాళాలు వేయించారు.

వర్గీకరణ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్‌ వడ్లమూరి కృష్ణస్వరూప్‌



లోయర్‌ ట్యాంక్‌బండ్‌లో నిరసన తెలుపుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్‌ వడ్లమూరి కృష్ణస్వరూప్‌, పోరాట సమితి జాతీయ వర్కింగ్‌ చైర్మన్‌ పబ్బుతి శ్రీకృష్ణ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ వీఎల్‌ రాజు డిమాండ్‌ చేశారు. ఎస్సీ వర్గీకరణపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కూడా రద్దు చేస్తూ ప్రకటన జారీ చేయాలన్నారు. మెజార్టీ జనాభా ఉన్న మాలలను తక్కువ జనాభాగా ఉన్నట్లు చూపి మాలలకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. మాలల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాల జాతికే వెన్నుపోటు పొడుస్తున్నారని వారు ధ్వజమెత్తారు. వర్గీకరణపై ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ శుక్రవారం లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో గళం విప్పాల్సిన మాల మంత్రులు, ఎమ్మెల్సీలు స్పీకర్‌ రేవంత్‌రెడ్డికి అమ్ముడు పోయారని ఆరోపించారు. జాతికి మోసం చేసిన మాల ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి జాతికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చర్యలతో మాలలతోపాటు 57 ఎస్సీ కులాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

◆ కాంగ్రెస్‌, బీజేపీ, ఎంఆర్‌పీఎస్‌, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజకీయ కుట్రలు చేసి పూర్తి స్థాయిలో దళితుల భవిష్యత్‌ను దెబ్బతీస్తున్నారని వారు ధ్వజమెత్తారు. వర్గీకరణను అడ్డుకోకపోతే మాల జాతికి భవిష్యత్‌ లేదని, బానిసత్వం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్‌.పద్మ, గ్రేటర్‌ అధ్యక్షుడు భూపల్లి హేమలత, దళిత బహుజన పార్టీ గ్రేటర్‌ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్‌కుమార్‌, నాయకులు సీహెచ్‌ సుబ్బారావు, ఎం.సత్యనారాయణ, సురేష్‌, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆహార నియమాలే ఆరోగ్యాన్ని కాపాడుతాయి

ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌ ప్రొ. లింబాద్రి



అంబేడ్కర్‌ కళాశాలలో జరిగిన ఫుడ్‌ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ లింబాద్రి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మంచి ఆహార నియమాలు, అలవాట్లే ఆరోగ్యాన్ని కాపాడుతాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌ ప్రొ. లింబాద్రి అన్నారు. శుక్రవారం డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ డిగ్రీ కళాశాలలో ఎంటర్‌ ప్రీమియర్‌ షిప్‌ ఆధ్వర్యంలో ఫుడ్‌ కార్నివల్‌ (ఆహారోత్సవం) ఫెస్టివల్‌ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఫుడ్‌ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రొ. లింబాద్రి మాట్లాడుతూ... మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాటుల్లో మార్పు రావాలని సూచించారు. ముఖ్యంగా బేకరీకి సంబంధించిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో ఆహార నియమాల గురించి చైతన్యం తీసుకురావడానికి ఈ ఫెస్టివల్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సుమారు 40కి పైగా ఫుడ్‌స్టాల్స్‌ను విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూట్రీషియన్‌ చారి, కళాశాల డైరెక్టర్‌ విష్ణుప్రియా, కళాశాల ప్రిన్సిపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య అభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్‌



అస్త్రా మహేశ్వరికి జ్ఞాపికను అందజేస్తున్న డా. సుచిత్ర

కాచిగూడ: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని ప్రముఖ సోషల్‌ మీడియా బ్లాగర్‌ అస్త్రా మహేశ్వరి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం, సరోజిని నాయుడు జయంతిని పురస్కరించుకుని నారాయణగూడలోని రెడ్డి కాలేజీలో ఆమె సోషల్‌ మీడియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్‌ కంటెంట్‌ రైటింగ్‌లో కెరీర్‌ గురించి వివరించారు. నైపుణ్యాల పెంపుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని అన్నారు. నైపుణ్య అభివృద్ధితోనే ఉజ్వలమైన భవిష్యత్‌ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆంగ్లం, విదేశీ భాషల విభాగం హెడ్‌ డాక్టర్‌ సుచిత్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ జీలం చటర్జీ పాల్గొన్నారు.

తునికి ఆకు సేకరణకు ప్రభుత్వం ఆదేశాలివ్వాలి

అఖిల భారత కిషాన్‌ సభ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి



రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వం వెంటనే తునికి ఆకు సేకరణకు ఆదేశాలు ఇవ్వాలని అఖిల భారత కిషాన్‌ సభ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 17న అన్ని జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ, డీఎఫ్‌ఓ అధికారులకు తునికి ఆకు సేకరణకు టెండర్‌లు నిర్వహించాలని కోరుతూ మెమోరండం ఇవ్వనున్నట్లు తెలిపారు. తునికి ఆకు టెండర్‌లు నిర్వహించి కార్మికులకు జీవనోపాధి కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బోనస్‌ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 14 ఏజెన్సీ జిల్లాలో 196 యూనిట్‌ల పరిధిలో 4లక్షల 60వేల మంది గిరిజనులు, గిరజనేతరులు రెండో పంటగా తునికి ఆకు సేకరణ చేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌.వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్‌, సీఐటీయూ ఉపాధ్యక్షులు భూపాల్‌, కేవీపీఎస్‌ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, అరుణజ్యోతి, ధర్మానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

రేషన్‌కార్డు దరఖాస్తుదారుల పేరుతో దోపిడీ



హైదరాబాద్‌ అడిషనల్‌ కలెక్టర్‌ ముకుందరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నేతలు

కాచిగూడ: నూతన రేషన్‌ కార్డు దరఖాస్తుదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న మీ–సేవ కేంద్రాలపై ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు ఎండీ జావీద్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌ జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ ముకుందరెడ్డిని డీవైఎఫ్‌ఐ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల దరఖాస్తులకు రూ.50 వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కానీ ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని మీ–సేవ కేంద్రాల నిర్వాహకులు, ఉద్యోగులు రూ.100 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌ స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మీ–సేవా కేంద్రాలపై తనిఖీలు చేపట్టాలని సూచించారు. మీ సేవా కేంద్రాల వద్ద సాంకేతిక లోపాలు ఎక్కువగా వస్తుండటంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డీవైఎఫ్‌ఐ నేతు దేవేందర్‌, రాజయ్య పాల్గొన్నారు.




అమరజవాన్లకు నివాళి

పుల్వామా ఘటనలో అమరులైన వీరజవాన్లకు శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్‌ ఉమారాణి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌ యాదవ్‌, వాసు, బల్బీర్‌, భీమ్‌రాజు, రవియాదవ్‌ పాల్గొన్నారు. – కాచిగూడ

ప్రేమతోనే ఏదైనా జయించగలం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నేటి సమాజంలో జరుగుతున్న కిరాతకాలు, దుర్మార్గాలను చూస్తుంటే బాధేస్తుందని అసలు మనం ఏ సమాజంలో ఉన్నామో అర్థం కాని దుస్థితి ఏర్పడిందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి అన్నారు. ప్రేమతోనే ఏదైనా జయించగలమని ఆమె అభిప్రాయ పడ్డారు. శుక్రవారం రాత్రి కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం, కుల నిర్మూల సంఘం సుందరయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కుల, మతాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. వివాహానికి పునాది ప్రేమేనని అన్నారు. కట్నం, కులం ప్రాతిపదికన జరుగుతున్న వివాహాలలో సైతం



కుల, మతాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జస్టిస్‌ రాధారాణి

సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఒకరునొకరు గౌరవించుకోవడం, ప్రేమించుకోవడం వల్ల కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు. తమిళనాడులో ఒక దళిత విద్యార్థి రెండు చేతులు నరకడం అత్యంత బాధాకరమని అన్నారు.

కుల, మతాంతర వివాహితులకు రక్షణ చట్టం కావాలి..

◆ కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. కులాంతర, మతాంతర వివాహితులకు రక్షణ చట్టం కావాలని డిమాండ్‌ చేశారు. అందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్‌ చేశారు. ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి వారి పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సామాజిక ఉద్యమ నేత అద్దంకి దయాకర్‌, సినీ దర్శకులు వేణు ఊడుగుల, సీపీఎం నేత ఎం దశరథ్‌, వివిధ సంఘాల నాయకులు గుత్తాజోత్స్న, వినయ్‌కుమార్‌, ఎండీ వాహిద్‌ పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తా



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని మహంకాళి సికింద్రాబాద్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్‌ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడతల బాలకృష్ణ ఆధ్వర్యంలో గుండగోని భరత్‌గౌడ్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్‌ కార్పొరేటర్‌ నవీన్‌గౌడ్‌, సంఘం రాష్ట్ర సలహాదారులు గుండగోని రామ్మోహన్‌గౌడ్‌, వంగాల బాలరాజుగౌడ్‌, వీరయ్యగౌడ్‌, టంగుటూరి మధుగౌడ్‌, సంతోష్‌గౌడ్‌, రవీందర్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండగోని భరత్‌గౌడ్‌ ప్రమాణ స్వీకారం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీజేపీ మహంకాళి సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడిగా తాను ఈనెల 15వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు గుండగోని భరత్‌గౌడ్‌ తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బైక్‌ ర్యాలీ ముషీరాబాద్‌లోని కశిష్‌ ఫంక్షన్‌ హాల్‌ వరకు కొనసాగుతుందన్నారు. అదే ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం 4గంటలకు ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌, కేంద్ర మంత్రి బండి సంజయ్‌, ఎంపీ ఈటల రాజేందర్‌ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని రక్షిద్దాం

ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. కె.పురుషోత్తంరెడ్డి



సదస్సులో పాల్గొన్న ప్రొ. కె.పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్‌ డా. మోహన్‌కుమార్‌

కాచిగూడ: మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్‌ కె.పురుషోత్తంరెడ్డి అన్నారు. బద్రుకా కాలేజ్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ ఆర్ట్స్‌ ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌, కౌన్సిల్‌ ఫర్‌ గ్రీన్‌ రివల్యూషన్‌ సహకారంతో శుక్రవారం కాచిగూడలోని బద్రుకా కళాశాలలో 'ఎస్‌డీజీ అండ్‌ క్లైమేట్‌ చేంజ్‌ – ట్రాన్స్‌ఫార్మేటివ్‌ రోల్‌ ఫర్‌ యూత్‌'అనే అంశంపై జరిగిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సహజ వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఎన్ని ఉన్నా అవి అమలు కావడం లేదన్నారు. సహజ వనరులను ముందు తరాలకు అందించాలని, వాటి తరుగుదల మానవాళి మనుగడకు ముప్పు అని పేర్కొన్నారు.

◆ భావితరాలకు కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్‌డీజీలు, వాతావరణ మార్పులకు సంబంధించిన వివిధ అంశాలపై తమ నైపుణ్యాన్ని విద్యార్థులు పంచుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు ఇంటరాక్టివ్‌ సెషన్లలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బద్రుకా కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బి.మోహన్‌కుమార్‌, శ్రీహరి సర్వోత్తమన్‌, ప్రొ. నందినిబిస్వాస్‌, డాక్టర్‌ నరసింహారెడ్డి, ప్రొ. అభిరామకృష్ణ, కె.లక్ష్మారెడ్డి, ఆర్‌.దిలీప్‌రెడ్డి, ప్రొఫెసర్‌ ఎస్‌.ఉపేందర్‌రెడ్డి, డాక్టర్‌ వినీత పాండ్య, లీలా లక్ష్మారెడ్డి, డాక్టర్‌ పి.వెంకటయ్య పాల్గొన్నారు.